

నష్టం. కాస్త, కూస్త. ఎవరికన్నా దొరికితే తెచ్చిస్తారేమో? పోనీ నేను బయటకు వెళ్ళి వెదికితే?

బయలుదేరపోతుంటే ఎవరో సార్ అని పిల్చారు. రైట్ వేశాను. ఇందాకటి ఆటో డ్రైవర్. "మీ పర్సు ఆటోలో పడిపోయిందండీ, ఇద్దామని తీసుకొచ్చాను" అతను దేవుడిలా కన్పించాడు. పర్సు గబుక్కున తీసుకుని డబ్బు లెక్కపెట్టాను. ఇరవై రెండు వందలు. అక్షరాలా ఇరవై రెండు వందలు. అమ్మయ్య, జీవకళ వెనక్కి వచ్చేసింది. వెంటనే నేను మామూలు మనిషినయ్యాను. వాస్తవం గుర్తుకొచ్చింది. ఇంతకు ముందు పర్సు దొరికితే తను చేసిన పని ఏమిటి? కేవలం అయిదు వందలకే కక్కుర్తి పడ్డాడు. మరి ఇతను? ఆఫ్ట్రాల్ ఆటో డ్రైవర్! ఎంత ఉన్నతంగా కన్పిస్తున్నాడు. మనస్సు ఒప్పుకోవడం లేదు. అతన్ని కిందకి దించేయాలి. చాలా మామూలుగా పర్సులోంచి ఓ రెండు వందలు తీసి అతని చేతిలో పెడుతూ "ఇదిగో నీ బహుమతి, ఆఫ్‌కోర్స్ నువ్వు ఇంత ఆశించివుండవనుకో, నా సంతోషాన్ని ప్రకటించడం కోసం..." అతన్ని ఓ మెట్టు దించడానికి నేను ఓ మెట్టు ఎక్కడానికి చాలా తూచి తూచి మాట్లాడాను. అతను దెబ్బతిన్నట్టు మొహం పెట్టాడు. "నేను మీరేదో బహుమతి ఇస్తారని ఆ డబ్బు వాపసు చేయలేదు. అది మీకు సంబంధించినది. మీకు చెందాల్సింది. అందుకే తెచ్చిచ్చాను. నాకు డబ్బే కావాలనుకుంటే ఆ మొత్తం నా సొంతమయ్యేది" అతను గిర్రున వెనుతిరిగి వెళ్ళిపోయాడు. నాకేం చెయ్యాలో అర్థం కాలేదు. నా ఓటమిని ఒప్పుకోదల్చుకున్నాను. "ఒక్క క్షణం ఆగు. నీ నిజాయితీ నాకు నచ్చింది. సామాన్యంగా చదువు మనిషిలో సంస్కారాన్ని తీసుకొస్తుంది. అటువంటిది నువ్వు చదువుకోకున్నా..." అతను నా మాటలను మధ్యలోనే ఆపు చేశాడు. "నేను పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేశాను" నేను నిర్ఘాంతపోయాను. "ఇంత చదువుకుని ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నావా?" అతనేమీ మాట్లాడలేదు. చిన్నగా నవ్వి ఊరుకున్నాడు. నేను కావాలనుకుంటే మా కంపెనీలో అతనికి ఏదో ఒక ఉద్యోగం ఇప్పించగలను. ఒక్క క్షణం ఆలోచించి చెప్పాను "రేపు ఒకసారి మా ఆఫీస్‌కి రా. నీకు ఇంతకన్నా మంచి ఉద్యోగం ఇప్పిస్తాను" అతను ఆనందంతో తబ్బిబ్బు అవుతాడనుకున్నాను. చాలా మామూలుగా వున్నాడు. "థాంక్యూ సార్! నేను అదే కావాలనుకుంటే రెండు సంవత్సరాల క్రితమే మంచి ఉద్యోగం మా నాన్నగారి సిఫార్సుతో సంపాదించే వాడిని. కానీ నీతినీ, నిజాయితీనీ నా సుఖం కోసం పణంగా పెట్టాలని నేను అనుకోవడం లేదు."

"కాని దాని కారణంగా మీరు జీవితాంతం కష్టాల్నీ, నష్టాల్నీ భరించాల్సి వస్తుందిగా."

చిన్నగా నవ్వి చెప్పాడు "నేనెప్పుడూ నా నీతినీ, నిజాయితీనీ వ్యాపారంలో పెట్టుబడిగా భావించలేదు, నష్టాన్ని గూర్చి ఆలోచించడానికి. నేను నిజాయితీగా వుండడం నిజాయితీ కోసమే. దాని కారణంగా నేను సుఖాన్ని కోల్పోవచ్చునేమో కాని, సంతృప్తిని సంపాదించుకున్నాను. మీ డబ్బు నాకు దొరికింది. దాన్ని నేను ఖర్చు పెడితే, ఈ నెలంతా సుఖంగా జీవించేవాడిని. కానీ దాని కారణంగా నేను సంతృప్తిని పొందగలనా? ప్రతిక్షణం నేరస్థుడిలా ఫీల్ అవుతూ, నేను హాయిగా వున్నానని నా మనస్సుని నేను మభ్యపుచ్చగలనా?" అతని మాటలు నా మనస్సుని సూటిగా తాకాయి. పర్సు తీసి ఈ సారి అడ్రస్ జాగ్రత్తగా చూశాను. బయటకు వస్తూ, అతనితో చెప్పాను. "మనం ఈ అడ్రస్‌కి వెళ్ళాలి." ●

## లోకువ

"ఛీ! ఛీ!! ఇదేం డ్రాఫ్టయ్యా! ఇంత ఛండాలంగా వుంది. అసలు ఎన్నేళ్ళ సర్వీసుంది నీకు! ఇన్నేళ్లయినా ఇంకా డ్రాఫ్టు రాయడం తెలీదటయ్యా నీకు? సరిచేసి పుటప్ చెయ్యి" అంటూ విసిరికొట్టాడు ఆఫీసర్ అప్లాచారి. మొహం మాడ్చుకుని పడిపోయిన ఫైలును తీసుకొని రూంలోంచి బయటకు వచ్చి సీట్లో కూలబడ్డాడు క్లర్కు గోపాల్రావ్.

ఎన్నిసార్లు చదివినా తను రాసిన డ్రాఫ్టులో ఏ తప్పూ కనబడడం లేదు. "ఆఫీసర్ కదా, మేమంతా ఏవో పురుగుల్లా కనబడతాం అనుకుంటూ. ఇష్టమొచ్చినట్టు వాగుతాడు. తన ఇ.ఎల్. అంత లేదు వాడి సర్వీసు. హు. పోనీ తప్పు ఎక్కడో చెప్పొచ్చుగా. అసలు వాడికి తెలిస్తే కదా. తనకు చెప్పడానికి" కసిగా తిట్టుకున్నాడు. ఎవర్నయినా కొట్టాలని, బాగా తిట్టాలని వుంది తనకు. మధన పడిపోయాడు గోపాల్రావ్. లంచ్ టైంకు ఇంటికి వెళ్లాడు. బాబిగాడు సీరియస్‌గా వున్న తండ్రి ఫేస్ చూసి సాయంత్రం తను వెళ్లాల్సిన చిరంజీవి సినిమాకు



డబ్బులు ఎలా అడగాలో సంశయంలో పడ్డాడు.

రాధ తండ్రీ, కొడుకులకు భోజనాలు వడ్డించింది.

"ఛీ! ఛీ!! ఇదేం కూర? ఇదసలు కూరేనా? ఇన్నేళ్ళు వచ్చినయ్యి. ఇంతవరకు కూర వండడం చేతకాదు ఛీ! ఛీ!!" అంటూ గుత్తి వంకాయ కూరను ప్లేటుతో సహా గిరవాటు వేసేశాడు.

రాధకు మండుకొచ్చింది. అయినా ఏమీ అన్లేదు. మౌనంగా ఆ కూర ప్లేటునూ ఆ ప్లేస్‌నూ క్లీన్ చేసింది. "హమ్మయ్య ఇప్పుడు మనస్సు ఎంతో తేలికగా వుంది తనకు" గట్టిగా ఊపిరి పీల్చి వదిలాడు రిలాక్స్‌గా వుంది. ఆఫీసర్ అప్లాచారి మీద కసి తీర్చుకున్నాననిపించింది గోపాల్రావ్‌కు.

ఆఫీసుకు బయలుదేరుతుండగా, అప్పుడు వినిపించింది "వెధవా, వెధవన్నర వెధవా" ధారాళంగా తిట్లు, దెబ్బలు, బాబిగాడి ఏడుపు. విన్లేక గోపాల్రావ్ గబగబా బయటకు నడిచాడు.

—ఎం.సి.హెచ్. పూర్ణచంద్రరావు